రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రాధాన్యమివ్వాలి

ఆర్జీ - 3 ఓసీపీ - 2 ను సందర్శిస్తున్న సీఎండీ, అధికారులు

- సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్
- ఆర్జీ - 3, ఏపీలో పర్యటన

రామగిరి మార్చి 29 : నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించుకోవాలని సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ అన్నారు.శుక్రవారం రామగుండం-3 ఏరియా లోని ఓసీ-2 ఉపరితల గనిలో పర్యటించారు. దీని లో భాగంగా ముందుగా వ్యూ పాయింట్ వద్ద ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపరితల గనిలో నడుస్తున్న మట్టి, బొగ్గు వెలికితీత పనులను పరిశీలించారు. క్వారీని సందర్శించారు. బేస్ వర్క్ షాప్‌లో గల పని స్థలాలు, యంత్రాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్ లో జరుగుతున్న సీమ్-3, పంచ్ ఎంట్రీ పనులను పరిశీలించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించినందుకు ఆర్జీ-3 ఏరియా అధికారులు, ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. అలాగే సంస్థ నిర్దేశించుకున్న 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యాలను భద్రతతో సాధించుకోవడానికి సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ పర్యటనలో వారితోపాటు డైరెక్టర్(ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) జీ వెంకటేశ్వరరెడ్డి, ఆర్జీ -3 జీఎం ఎన్ సుధాకర రావు, ఏపీఏ జీఎం కే వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజినీర్లు పీ ఎలీషా, సీతారామం, ఎస్‌వోటు జీఎంలు జీ రఘుపతి, బండి సత్యనారాయణ, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ సీహెచ్.వెంకటరమణ, ప్రాజెక్టు ఇంజనీర్లు టి.రఘురాం, ఎం నాగరాజు, మేనేజర్లు కె.వి.రామారావు, తిరుపతి అధికారులు, ఉద్యోగులు ఉన్నారు.

హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలి

సీఎండీకి వినతిపత్రం ఇస్తున్నశ్రీనివాస్

గోదావరిఖని,మార్చి 29: సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు తక్షణమే హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని తెలంగాణ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షులు మద్దెల శ్రీనివాస్ కోరారు. ఈమేరకు శుక్రవారం సింగరేణి సీఎండీని కలిసి వినతి పత్రం అందజేశారు. జీవో 94ను రద్దు చేయించి 22 జీవో అమలు చేయించేలా ప్రభుత్వంతో మాట్లాడాలని, కోలిండియా మాదిరిగా 8 రాష్ట్రాల్లో జీత భత్యాలు, హక్కులు కల్పిస్తున్నారో సింగరేణిలో కూడా కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని విన్నవించారు. గత ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులను పట్టించుకోలేదనీ, కాంగ్రెస్ ప్రభుత్వమైనా కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేస్తుందని భావిస్తున్నట్లు తెలిపారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం

బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు

పెద్దపల్లి కమాన్, మార్చి 29 : పెద్దపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2024-25కు గాను అధ్యక్ష, కార్యదర్శులను గురువారం రాత్రి ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లకిడి భాస్కర్, కార్యదర్శిగా కోటగిరి శ్రీనివాస్ ఎన్నికైనట్లు ఎలక్షన్ అధికారి చంద్రమౌళి తెలిపారు. ఉపాధ్యక్షుడిగా అల్లాడి ఫణికుమార్, సంయుక్త కార్యదర్శిగా టీ అశోక్, లైబ్రరీ సెక్రటరీగా బొంకూరి సంతోష్. కోశాధికారిగా సురేందర్ గౌడ్, క్రీడా సాంస్కృతిక కార్యదర్శిగా బర్ల రమేశ్ బాబు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పుట్ట రవికుమార్, ఆసరి రమేశ్, వడ్ల కొండ రమేశ్ ఎన్నికయ్యారు. వీరి ఎన్నికల పట్ల పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

నార దీప్తి ఎన్నికపై హర్షం

ధర్మారం,మార్చి20: మండల కేంద్రానికి చెందిన విద్యావేత్త, నార కిషోర్ రెడ్డి సతీమణి నార దీప్తి తెలంగాణ హైకోర్టు బార్ అసోషియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎన్నిక కావడంపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.గురువారం హైదరాబాద్‌లో జరిగిన హైకోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. ఈఎన్నికల్లో హైకోర్టు న్యాయవాది దీప్తి పోటీ చేసి అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైంది. ఉమ్మడి రాష్ట్రంతో పాటు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత హైకోర్టు చరిత్రలో బార్ అసోసియేషన్ ఎన్నికల్లో మహిళ న్యాయవాది దీప్తి పోటీ చేసి వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నిక కావడం ప్రప్రథమమని న్యాయవాదులు పేర్కొన్నారు. దీప్తి ఎన్నిక పట్ల నంది మేడారం జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నార అశోక్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆకారి రాజేశం, వైస్ ప్రెసిడెంట్ బొట్ల లక్ష్మి నర్సయ్య,సీనియర్ ఈసీ మెంబెర్స్ గడ్డం లింగా రెడ్డి, ఈదుల ప్రదీప్ రెడ్డి, న్యాయవాదులు ఎంపెల్లి ప్రకాష్, బీమారపు సంపత్ కుమార్, ఎన్. రజిత తదితరులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

కనీస వేతనం రూ. 26వేలుగా నిర్ణయించాలి

కరపత్రాలను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

జ్యోతినగర్, మార్చి 29: ప్రజా పాలన అని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలుగా నిర్ణయించాలని సీఐటీయూ అనుబంధ రామగుండం ఇండస్ట్రీయల్ వర్కర్స్ యూనియన్ ప్రధానకార్యదర్శి నాంపాని శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఎన్టీపీసీ లేబర్‌గేట్‌లో కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలపై పేర్కొన్న యూనియన్ కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. కనీస వేతన జీవోలపై ప్రభుత్వం ఇచ్చిన ప్రీలిమినరీ నోటిఫికేషన్‌ను రద్దు చేసి కొత్త ప్రీలిమనరీ నోటిషికేషన్‌తో కార్మికులకు నష్టదాయకంగా ఉందన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన జీవో నెం.22ను గెజిట్ చేసి కనీస వేతనం రూ. 26వేలుగా పెంచాలని కాంగ్రెస్ ప్రభుత్వ సీఎంకు లేఖ ద్వారా కార్మిక పాలసీని ప్రకటించి ప్రజాపాలనలో కార్మిక సమస్యలను పరిష్కారించాలని కోరుతున్నట్లు ఆయన తెలిపారు. ఇక్కడ యూనియన్ నాయకులు దండ రాఘవరెడ్డి, కే రాజ్‌కుమార్, చంద్రమౌళి, టీ శ్రీనివాస్, వెంకన్న, వీ శ్రీనివాస్, రవి, పరమేశ్, భాస్కర్, శ్రీనివాస్, పోచయ్య ఉన్నారు.

లాడ్జిపై నుంచి కిందపడి ఒకరి మృతి

జ్యోతినగర్, మార్చి 29: ఎన్టీపీసీ ఎఫ్ సీఐ క్రాస్‌రోడ్‌లోని మణిలీల లాడ్జిపై నుంచి కిందపడి గురువారం రాత్రి ఛత్తీస్ ఘడ్ కోర్బాకు చెందిన దర్శన్‌సింగ్(24) మృతి చెందాడు. మృతుడు లాడ్జిలోని నాలుగో అంతస్తు నుంచి కిందపడడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. దర్శన్ సింగ్ ఒక కంపెనీకి సంబంధించిన స్పేర్ పార్ట్స్ సప్లయి చేయడానికి కంపెనీకి చెందిన మరో వ్యక్తితో కలిసి ఇద్దరు చత్తీస్‌ఘడ్ నుంచి ఎన్టీపీసీకి వచ్చారు. మణిలీల లాడ్జీలో దిగారు. దర్శన్‌సింగ్ మాత్రం లాడ్జీపై నుంచిపడి మృతిచెందడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్‌కిరణ్ కేసు విచారణ చేపట్టారు.

36 గంటల నిరసన దీక్షను విజయవంతం చేయండి

- రామగుండంలో అభివృద్ధి పేరుతో ఇబ్బందులు సృష్టిస్తే సహించేది లేదు
- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

మాట్లాడుతున్న కోరుకంటి చందర్

గోదావరిఖని, మార్చి 29: రైతులకు అండగా నిలవడానికి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 30న పెద్దపల్లిలో నిర్వహించనున్న 36 గంటల రైతు నిరసన దీక్షను విజయవంతం చేయాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కోరారు. గోదావరిఖని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రైతులు అనేక కష్టాలు పడుతున్న పరిస్థితి కనిపిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా, రైతుల కష్టాలు తెలిసేలా 36 గంటల రైతు నిరసన దీక్షను విజయవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీక్షను విజయంతం చేసేందుకు రామగుండం నియోజక వర్గంలోని రైతులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. రామగుండం నియోజక వర్గంలో అభివృద్ధి పేరుతో జరుగుతున్న కార్యక్రమాలు తుగ్లక్ పాలనను తలపిస్తున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీఅభివృద్ధికి అడ్డంకి ఎంత మాత్రం కాదని, ఇక్కడి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అనుసరిస్తున్న విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. అర్ధరాత్రులు కట్టడాలను కూల్చివేయడం సరైంది కాదన్నారు. అన్ని రాజకీయ పార్టీలతో అఖిల పక్షం ఏర్పాటు చేసి అభివృద్ధి విషయంలో ముందుకు సాగాలన్నారు. తన ఇష్టం వచ్చినట్టుగా ప్రవర్తిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో మురళీధర్‌రావు, పీటీ స్వామి, మాదాసు రామ్మూర్తి, తిమోపతి, పర్లపల్లి రవి తదితరులున్నారు.

నిరాహార దీక్షను విజయవంతం చేయండి

ముత్తారం, మార్చి 29: వరిపంట నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం కింద రూ. 25వేలు కేటాయించాలని కోరుతూ బీఆర్ఎస్ చేపట్టనున్న నిరాహార దీక్షను విజయవంతం చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు పోతుపెద్ది కిషన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్ లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు దీక్ష చేపట్టనున్నట్లు వివరించారు. మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు.

ఆర్జీ రీజియన్ మహాసభను జయప్రదం చేయండి

మహాసభ పోస్టర్ విడుదల చేస్తున్న సభ్యులు

యైటింక్లయిన్ కాలనీ, మార్చి 29 : ఏప్రిల్ 7న నిర్వహించనున్న రామగుండం రీజియన్ సింగరేణి ఉద్యోగుల మహాసభను జయప్రదం చేయాలని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి కోరారు. శుక్రవారం స్థానిక ప్రెస్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాలతో ఏర్పడిన తెలంగాణకు గత ప్రభుత్వం సింగరేణి ప్రాంతానికి చేసిందేమీ లేదన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందని, ప్రతి విషయానికి నాయకులను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. ఇలాంటి అనవాయితీ కొనసాగితే సింగరేణికి పెను ప్రమాదంగా మారే అవకాశముందన్నారు. కార్మికులకు సంబంధించిన ఎలాంటి సమస్యలైనా కార్మిక సంఘాలతోనే పరిష్కారమవుతాయని తెలిపారు. ఓసీపీ వల్ల నీరు అడుగంటి పోయి వ్యవసాయం కుంటుపడుతుందన్నారు. వ్యవసాయం కుంటుపడకుండా నీటి సమస్యను తీర్చాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణిని ప్రైవేటీకరణ చేయకుండా వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 7న గోదావరిఖనిలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించే మహాసభకు ఉద్యోగులందరూ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆర్జీ-2 కార్యదర్శి వేగోళపు కనుకయ్య, జైపాల్‌సింగ్, బీరన్న, వీరేశం, చందు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు

కోల్‌సిటీ : శిలువ మోస్తున్న యేసుక్రీస్తు పాత్రధారి

మంథని : శిలువ మోస్తున్న చిన్నారి

ముంథని, మార్చి 29: గుడ్ ఫ్రైడే వేడుకలను క్రిస్టియన్లు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా మంథనిలోని సీయోను ప్రార్థన మందిరంలో యేసుక్రీస్తు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా పాస్టర్ వల్లూరి ప్రభాకర్ మాట్లాడారు. గుడ్ ఫ్రైడే క్రైస్తవులకు పరమ పవిత్రమైన రోజన్నారు. సమస్త మానవాళి పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల జాలి, అవధులులేని త్యాగం, సడలని ఓర్పు, శత్రువుల పట్ల క్షమాగుణం అనే గొప్ప లక్షణాలను కలిగి ఉండటం కరుణామయుడైన యేసుక్రీస్తుకే సాధ్యమైందని కొనియాడారు. ఈ సందర్భంగా యేసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలను ధ్యానించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మంథని పురవీధుల గుండా శిలువ ధ్యాన సువార్త కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్లు పెండ్రు ప్రసన్నకుమార్, దూడ మహేష్, కల్వల సామ్యేల్, అజ్మీరా దయారాజ్, మార్క్, గద్దల రాజేష్, ఇంటర్నేషనల్ మిషన్స్ ఇండియా ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్, సంఘ పెద్దలు రామగిరి కుమార్, ఈర్ల సదానందం, ప్రేమ్ కుమార్, ప్రసాద్, రమేష్, దాసరి సదానందం పాల్గొన్నారు.

కోల్‌సిటీ, మార్చి 29: గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. గోదావరిఖని లోని పలు చర్చిలు శుక్రవారం క్రైస్తవులతో కిటకిటలాడాయి. యేసు ప్రభువును స్మరించుకుంటూ వేడుకలను నిర్వహించారు. నగరంలోని ప్రధాన చర్చిలో ముందుగా శిలువ యాగం నిర్వహించి అనంతరం ఏసుక్రీస్తు పడిన కష్టాలను చూపిస్తూ భక్తులు శిలువ యేస్తు ప్రదర్శన సాగించారు. భటులు క్రీస్తు వేషధారణలో ఉన్న భక్తుడిని కొరడాలతో కొట్టుకుంటూ ప్రధాన కూడళ్లలో ఊరేగించే దృశ్యం పలువుర్ని ఆకట్టుకుంది. కార్యక్రమంలో వివిధ చర్చిల పాస్టర్లు, క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారి వేధింపులకు యువకుడి ఆత్మహత్య

శివసాయి(ఫైల్)

సుల్తానాబాద్, మార్చి 29 : తీసుకున్న డబ్బులు ఇవ్వడంలో ఆలస్యం కావడంతో వడ్డీ వ్యాపారి వేధించిన తీరుతో మనస్తాపం చెంది వల్స శివసాయి అనే యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మున్సిపల్ పరిధిలోని శాస్త్రీనగర్‌కు చెందిన వల్స శివసాయి అనే యువకుడు సుల్తానాబాద్ పట్టణానికి చెందిన మజార్ అనే వ్యక్తి వద్ద అప్పుగా రూ. 70 వేలు తీసుకున్నాడు. డబ్బులు చెల్లించడంలో ఆలస్యం కావడంతో వ్యాపారి మజార్.. శివసాయి ఇంటికి వెళ్లి వేధింపులకు గురిచేశాడు. తన వద్ద డబ్బులు లేవని మరో రెండు నెలలు వాయిదా కావాలని కోరగా మజార్ పట్టించుకోకుండా అతని వద్ద నున్న కారును బలవంతంగా తీసుకుపోవడంతో వీధిలో తన పరువు పోయిందని మనస్తాపానికి గురయ్యాడు. ఈనెల 27న అర్ధరాత్రి గడ్డి మందు సేవించి ఆత్మ హత్య చేసుకున్నాడు. శివసాయి గడ్డి మందు తాగి తన స్నేహితులకు ఫోన్ చేసి నేను వడ్డీ వ్యాపారి మజార్ కారణంగానే ఆత్మహత్య చేసుకుంటున్నానని తెలిపాడు. వెంటనే స్నేహితులు, కుటుంబ సభ్యులు శివ సాయిని సుల్తానాబాద్ ప్రభుత్వ దవాఖానాకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఉన్నత వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానాకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. వల్స శ్రీనివాస్, ఆయన భార్య ఇద్దరూ దివ్యాంగులే. శివసాయి ఒక్కడే సంతానం. ఇక తమ కుమారుడు లేడని వారు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

పాడి రైతులతో ఎన్టీపీసీ ఈడీ ఇంటరాక్షన్

మాట్లాడుతున్న ఎన్టీపీసీ ఈడీ

జ్యోతినగర్, మార్చి 29: ఎన్టీపీసీ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ నిర్వహణలో జీవనోపాధి పొందుతున్న ఎన్టీపీసీ ప్రభావిత గ్రామాలకు చెందిన మహిళా పాడి రైతులతో శుక్రవారం ఎన్టీపీసీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కేధార్ రంజన్‌పాండు స్థానిక ఎన్టీపీసీ ఈడీసీ మిలినీయం హాల్‌లో ఇంటరాక్షన్ సమావేశం నిర్వహించారు. పాడి రైతుల జీవనోపాధిపై చర్చించిన ఈడీతో ఉపాధి లబ్ధిదారులు తమ జీవనోపాధి పనితీరును వివరించారు. నెలసరి ఆదాయంను పేర్కొన్న జీవనోపాధిపై హర్షం వ్యక్తం చేశారు. ఇంటిగ్రేటెడ్ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు గడువు ఏప్రిల్‌తో ముగియడంతో పొడగించాలని ఈ సందర్భంగా రైతులు ఈడీని కోరారు. ఇక్కడ ఎన్టీపీసీ డీజీఎం హెచ్ఆర్ ఎస్ ప్రశాంత్, అధికారి వేముగంటి యుగేందర్‌రావు, ట్రస్ట్ రాష్ట్ర అధినేత పీవీ శర్మ, తదితరులు ఉన్నారు.

ఇఫ్తార్‌కు హాజరైన ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ



ఇఫ్తార్ లో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

పెద్దపల్లి,మార్చి29:పెద్దపల్లి పట్టణ కేంద్రంలోని ఎంబీ గార్డెన్స్‌లో శుక్రవారం రాత్రి రేగుంట అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథులు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ, ఎమ్మెల్సీ తానిపర్తి భాను ప్రసాద్ హాజరయ్యారు. ఈసందర్భంగా వారు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మైనారిటీ మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, మైనార్టీ సోదరులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ ఆవిర్భావ వేడుకలు

పెద్దపల్లి టౌన్, మార్చి 29: జిల్లా కేంద్రంలోని ఉదయ్‌నగర్‌లోని జిల్లా టిడిపి కార్యాలయంలో 42వ, ఆవిర్భావ వేడుక లు శుక్రవారం ఘనంగా నిర్వహిం చారు. పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణి చేశారు. ఈ సందర్భం గా పెద్దపల్లి జిల్లా మాజీ అధ్యక్షుడు అక్కపాక తిరుపతి, పెద్దపల్లి పార్లమెంట్ ఉపాధ్యక్షుడు అందె భాస్కరచారి మాట్లాడారు. 42 యేండ్ల క్రితం ఏర్పాటుయిన టిడిపి బడుగు బలహీన వర్గాల అభ్న్నతికి అన్న నందమూరి తారాక రామారావు ఆధ్యర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రల్లో జరిగిన సాధరణ అసెంబ్లీ ఎన్నికోల్లో భారీ మెజార్టీ సాధించి ప్రభంజనం సృష్టించిందన్నారు. అతి తక్కువ సమయంలో టిడిపి ఎక్కువ సీట్లు సాధించి అధికారం చేపట్టిందని తెలిపారు. ఇక్కడ నాయకులు కోలా కిషన్‌రావు, పెద్దపల్లి శంకర్, కొప్పుల మురళి, కలవేణ రాజేశం, కీర్తి సత్యనారాయణ, కంటిపూడి రామకృష్ణ, విక్రం తదితరులు పాల్గొన్నారు.

వాహనాల బ్లాక్ స్టిక్కరింగ్ తొలగింపు

రామగిరి, మార్చి 29 : రామగుండం పోలీస్ కమిషనరేట్ రామగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో గల పన్నూరు ఎక్స్ రోడ్ లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవా రం మంథని సీఐ వెంకటేశ్వర్లు రామగిరి ఎస్సై సందీప్ కుమార్ సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహించారు. వాహన తనిఖీల్లో భాగంగా కార్లు ఇతర వాహనాల విండో గ్లాస్ లకు బ్లాక్ స్టికెరింగ్ గల వాహనాలను ఆపి వాటికి ఫైన్ వేసి అక్కడే తొలగించడం జరిగినది. అదేవిధంగా వాహనదారులు బ్లాక్ స్టికర్లు ఉపయోగించిన అనుమతి లేకుండా సైరన్‌ను వేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు.

ఎన్టీపీసీని సందర్శించిన రామగుండం సీపీ

యూనిట్ 7 కంట్రోల్ రూంలో రామగుండం సీసీ, అధికారులు

జ్యోతినగర్, మార్చి 29: రామగుండం ఎన్టీపీసీని శుక్రవారం రామగుండం పోలీసు కమిషనర్ ఎం శ్రీనివాసులు సందర్శించారు. ప్లాంటులోని యూనిట్ 7 కంట్రోల్ గదిని సందర్శించిన సీపీ విద్యుదుత్పత్తి పరిశీలించి ఉత్పత్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే బాయిలర్, జనరేటర్‌ను సందర్శించిన సీపీ వ్యూపాయింట్ నుంచి ఎన్టీపీసీ రిజర్వాయర్, కూలింగ్ టవర్స్‌ను పరిశీలించారు. ఇక్కడ రామగుండం సీఐ అజయ్‌బాబు, ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్‌కిరణ్, ఎన్టీపీసీ అధికారులు ఉన్నారు.

ఎల్ వోసీ చెక్కు అందజేత

రామగిరి, మార్చి 29 : మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన రైన్ల సుమలత అనే మహిళకు రూ. 1.60లక్షల ఎల్‌ల్వోసీ మంజూరైంది. కొంత కాలంగా న్యూరో సంబంధిత వ్యాధితో బాధపడుతున్న సుమలత నిమ్స్‌లో చికిత్స పొందుతున్నది. ఆర్థిక సాయం కోసం మాజీ జడ్పీటీసీ ద్వారా మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం మంజూరు చేయించారు. ఈమేరకు శుక్రవారం మంత్రి సహాయకులు హైదరాబాద్ క్యాంపు కార్యాలయంలో బాధితురాలి కుటుంబ సభ్యులకు ఎల్వోసీ మంజూరు పత్రాలు అందజేశారు.

మనోవేదనతో యువకుడి ఆత్మహత్య

యైటింక్లయిన్ కాలనీ మార్చి 29 : రామగుండం కార్పొరేషన్ పరిధిలోని వీర్లపల్లి గ్రామానికి చెందిన గాజుల నర్సయ్య (35) ఎన్‌టీపీసీ బొగ్గును తరలించే రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి అన్న గాజుల మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఖని టూటౌన్ సీఐ బీ. రవీందర్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. వీర్లపల్లి గ్రామానికి చెందిన నర్సయ్య ఓసీపీ-3 సీహెచ్‌పీ బెల్ట్ క్లీనింగ్ సెక్షన్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. అతనికి ఎనిమిదేళ్ల లావణ్యతో వివాహమైంది. కుతూరు, కుమారుడు ఉన్నారు. మూడేళ్ల క్రితం కుటుంబ కలహాలతో భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో మనోవేదనకు గురైన నర్సయ్య మద్యానికి బానిసయ్యాడు.తరచూ తాను ఆత్మహత్య చేసుకుంటానని బంధుమిత్రులతో చెబుతుండేవాడు. ఇదే క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున తల్లి కొమురమ్మకు తాను చనిపోతానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఓసీపీ-3 సీహెచ్‌పీ సమీపంలోగల రైలు పట్టాలపై బొగ్గు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.

కాంట్రాక్ట్ కార్మికుల పని వేళలు మార్చాలి

మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

రామగిరి, మార్చి 29: వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల పని వేళలు మార్చాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న డిమాండ్ చేశారు. ఆర్జీ-3 సివిల్ విభాగంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. సింగరేణి గనుల వద్ద ఇప్పటికే 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు దాటి ఉన్నందున కాంట్రాక్ట్ కార్మికులు పనుల వద్ద వేసవి తాపానికి తాళలేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. కార్మికులు విధులకు హాజరయ్యే క్రమంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని కోరారు. ఏప్రిల్ 1నుంచి ఉదయం 6 గంటల నుంచి ఒంటి గంట వరకు మాత్రమే పనులు నిర్వర్తించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు సదయ్య, వెంకటేశ్, రమేశ్, శ్రీనివాస్, బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

జూలపల్లి, మార్చి 29 : వెంకట్రావ్‌పల్లిలో పర్లపెల్లి రాయమల్లు కుటుంబ సభ్యులను శుక్రవారం పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పరామర్శించారు. రాయమల్లు చిత్ర పటంపై పూలు చల్లి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇక్కడ ఏఎంసీ మాజీ చైర్మన్ కంది చొక్కారెడ్డి, బీ